



	ఇఫ్తార్	సెహరి
	గురువారం	శుక్రవారం
కర్నూలు	6:33	5:05
నంద్యాల	6:29	5:05

రంజాన్ వేళలు

కళ్యాణం.. నృసింహుడి వైభోగం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12(ఆంధ్రజ్యోతి): నమో నారసింహా.. ఉగ్రం వీరం మహావిష్ణుం అంటూ భక్తజనం స్మరిస్తుండగా దిగువ అహోబిల క్షేత్రంలో లక్ష్మీ నృసింహ స్వామి కల్యాణోత్సవం బుధవారం రాత్రి నయనానందకరంగా జరిగింది. అహోబిల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిలంలో వేదపండితులు ముందుగా స్వామి, అమ్మవారికి నవకలశ తిరుమంజనం, విశేష పూజలు నిర్వహించారు. తిరు నక్షత్రం సందర్భంగా అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీరంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామివారిని పుష్ప పల్లకిలో ఆలయ మాడవీధుల్లో ఉత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి స్వామివారి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, మహాప్రసాదాన్ని అధికారులు అహోబిల మఠం పీఠాధిపతికి అందజేశారు. శ్రీదేవీ భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు శాస్త్రోక్తంగా ఉదయం అభిషేకం, సాయంత్రం గజ వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించారు.



మాంగల్యం చూపుతున్న ఆలయ ప్రధాన అర్చకులు



కల్యాణోత్సవం తిలకించేందుకు తరలి వచ్చిన భక్త జనం



గజ వాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదవరదస్వామి

రమణీయం.. ప్రహ్లాద వరదుడి కల్యాణం

దిగువ అహోబిల క్షేత్రంలో ప్రహ్లాద వరదస్వామి, అమృతవల్లి అమ్మవారి కల్యాణం రమణీయంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ఆభరణాలు, వివిధ రకాల పూలమాలలతో పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా ఎదుర్కోళ్లు నిర్వహించారు. పద్మశాలి సంఘం తరఫున పడకండ్లకు చెందిన కోటా రామయ్య, శారద దంపతులు కల్యాణోత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించి స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ వేడుకలను పీఠాధిపతితోపాటు ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్, మేనేజర్ మురళీధరన్, సంపత్ కుమార్‌స్వామి, బాలసుబ్రమణ్యం పర్యవేక్షించారు.

అశ్వ వాహనంపై శ్రీవారు

ఎగువ అహోబిలంలో జ్వాలా నృసింహస్వామి బుధవారం అశ్వ వాహనంపై విహరించారు. ఉభయదేవేరులతో కొలువైన స్వామివారిని విశేషంగా అలంకరించి సంప్రదాయబద్ధంగా ఉత్సవం నిర్వహించారు. ఆలయ యాగశాల ప్రాంగణంలో వేదమంత్రోచ్చారణలతో అర్చకులు సాయంత్రం తొట్టి తిరుమంజనం నిర్వహించారు. రాత్రి జ్వాలా నరసింహ స్వామిని అశ్వ వాహనంపై కొలువుంచి మేళతాళాల మధ్య ఆలయ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

'ఎగువ'లో నేడు రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో గురువారం వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు హాజరుకానుండడంతో నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. దిగువ అహోబిల క్షేత్రంలో కాళింగనర్తనోత్సవం, శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం, తొట్టి తిరుమంజనం నిర్వహిస్తారు. ప్రహ్లాదవరదుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

- 'దిగువ' అహోబిలంలో ఘనంగా కల్యాణోత్సవం
- ఎగువ అహోబిలంలో తొట్టి తిరుమంజనం
- అశ్వ వాహనంపై విహరించిన జ్వాలా నరసింహస్వామి



దిగువ అహోబిలంలో తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు



దిగువ అహోబిలంలో పీఠాధిపతికి పల్లకి ఉత్సవం

న్యూస్ బాక్స్

ఇంటర్ పరీక్షకు 353 మంది గైర్హాజర్

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 353 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 53 పరీక్షా కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 12,285 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సివుండగా 11,932 మంది హాజరయ్యారు. 353 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో సునీత తెలిపారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ రాష్ట్రంలోని కలెక్టర్లతో పదోతరగతి పరీక్షల నిర్వహణ, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో చర్చించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 17నుంచి 31వ తేదీవరకు జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, డీఎంహెచ్‌ఓ డా. వెంకటరమణ, డీసీహెచ్ఎస్ డాక్టర్ జఫ్రుల్లా, డీఈఓ జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'యువత' పోరు ఎక్కడ?

- కనబడని విద్యార్థులు, నిరుద్యోగులు, తల్లిదండ్రులు
- అందరూ వైసీపీ నాయకులు, కార్యకర్తలే..

నంద్యాల నూనెపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు కనపడలేదు. కూటమి ప్రభుత్వంలో విద్యార్థులు, నిరుద్యోగులు దగా పడ్డారని యువత పోరు పేరిట కలెక్టరేట్ కార్యాలయాలు ముట్టడించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పిలుపునిచారు. అయితే అందుకు భిన్నంగా బుధవారం చేపట్టిన యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు, వారి తల్లిదండ్రులు కనిపించకపోవడం గమనార్హం. ఇందులో భాగంగా వైసీపీకి చెందిన మాజీలు, ద్వితీయ స్థాయి నాయకులు, కార్యకర్తలు మాత్రమే పాల్గొన్నారు. బుధవారం ఉదయం స్థానిక నూనెపల్లె సెంటర్‌లో వైసీపీ నాయకుల హడావుడితో స్థానికులకు ఏం జరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అయిదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఏమి చేయకపోగా ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చవిచూసినా అర్థం పర్థంలేని కార్యక్రమాలు దేనికంటూ ప్రజలు పెదవి విరిచారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, ప్రతి ఏడాది నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఎగ్గొట్టి ఎనిమిది నెలల కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో నిరుద్యోగులు, యువత వైసీపీకి బుద్ధి చెప్పినా మార్పు రాలేదని ఎద్దేవా చేశారు.


పోరులో పాల్గొన్న వైసీపీ మాజీలు, నాయకులు

యువత పోరులో భాగంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అధ్యక్షతన యువత పోరు కార్యక్రమం జరిగింది. కూటమి పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులకు అన్యాయం జరిగిందంటూ కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల మాజీ ఎమ్మెల్యేలు, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, నందికొట్కూరు ఇంచార్జి డా.సుధీర్, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, జిల్లా ఉపాధ్యక్షుడు అమిర్‌బాషా తదితర నాయకులు, కార్యకర్తలు నూనెపల్లె నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో భారీఎత్తున పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు. వైసీపీ శ్రేణులను నిలువరించారు. కేవలం ప్రధాన నాయకులనే లోపలికి అనుమతిస్తామని చెప్పడంతో మాజీ ఎంపీతోపాటు మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ, నంద్యాల మున్సిపల్ చైర్మన్లు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్‌లకు మాత్రమే కలెక్టర్ చాంబర్‌లోకి అనుమతించారు. కలెక్టర్‌కు వైసీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆవరణలో మీడియాతో మాట్లాడారు.



ధర్నా చేస్తున్న వైసీపీ మాజీ ఎంపీ, ఎమ్మెల్యేలు

పది మంది సీఐల బదిలీ



కర్నూలు క్రైం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా సీఐల బదిలీలను చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. బదిలీ అయిన వారి వివరాలు ఇలా...

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.చంద్రశేఖర్	రాయచోటి, అన్నమయ్య జిల్లా	వీఆర్, కర్నూలు
బీవీ చలపతి	ఆలూరు సర్కిల్	రాయచోటి, అన్నమయ్య జిల్లా
ఎల్.రవి శంకర్ రెడ్డి	ఉమెన్ పీఎస్, అన్నమయ్య జిల్లా	ఆలూరు సర్కిల్
జి.శంకర్ మల్లయ్య	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు (ఔట్‌పోస్టు)	ఉమెన్ పీఎస్, అన్నమయ్య జిల్లా
ఓ.మహేశ్వర్ రెడ్డి	వీఆర్, కర్నూలు	ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు (ఔట్‌పోస్టు)
ఎస్‌కే మహ్మద్ ఆలి	మన్నూరు, అన్నమయ్య జిల్లా	సైబర్ సెల్, అన్నమయ్య జిల్లా
ఎస్.కుల్లాయప్ప	వీఆర్, కడప	మన్నూరు, అన్నమయ్య జిల్లా
ఎన్.రాజశేఖర్ రెడ్డి	వీఆర్, అనంతపురం	ఆదోని టూటౌన్ పీఎస్
ఓ.విజయభాస్కర్	వీఆర్, నంద్యాల	గోనెగండ్ల యూపీఎస్,
ఎ.గంగాధర్	గోనెగండ్ల యూపీఎస్	వీఆర్ కర్నూలు

దోపిడీకిపోయి దొరికిపోయారు..!
చిత్తూరు ఘటనలో నంద్యాల జిల్లా నేరస్థులు 7
కిడ్నీలు జాగ్రత్త 6

ఉల్లి.. ఆశలు సన్నగిల్లి...!



ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి సాగు జూదంగా మారింది. అన్నీ అనుకూలిస్తే.. రైతులకు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. లేదా అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది. ఈ స్థితిలో ఆరేళ్ల క్రితం అంటే 2019లో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకునేందుకు రాయితీని ప్రకటించింది. వెనువెంటనే జరిగిన ఆనాటి ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రావడం ఉల్లి రాయితీని అటకెక్కించేసి రైతులకు తీరని ద్రోహం చేసింది. కూటమి ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని ఉల్లి రైతులు కోరుకుంటున్నారు.



ఈ రైతు పేరు రామేశ్వరరెడ్డి. 2019లో ఉల్లి రాయితీ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు కర్నూలు మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయం వద్దకు మోకాళ్లరిగేలా తిరిగాడు. కూటమి ప్రభుత్వం వచ్చిందని ఇప్పటికైనా ఉల్లి రాయితీ అందించాలని అధికారులను వేడుకునేందుకు గత శనివారం కార్యాలయం వద్దకు వచ్చాడు. ప్రభుత్వం మంజూరు చేస్తే తప్పకుండా రాయితీని బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 9,740 మంది రైతులు ఉల్లి రాయితీ కోసం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు.

- రాయితీ కోసం రైతుల పడిగాపులు
- 2019లో రూ. 6.45 కోట్ల నిధులు మంజూరు
- వెనక్కి పంపిన వైసీపీ ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంలో కదిలిన నిధుల మంజూరు ఫైలు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2019లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రైతులు సాగు చేసిన ఉల్లి పంటకు కనీస ధర కూడా అందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారిని ఆదుకునేందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వింటం ఉల్లికి రూ700 మద్దతు ధరను ప్రకటించి వ్యాపారి అందించే ధరకు, తాము అందించే రాయితీని కలుపుకుని రైతుకు క్వింటంపై రూ.700 అందేలా ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందిన తక్షణమే పథకం అమలు కోసం వెంటనే నిధులను కూడా మంజూరు చేశారు. దాదాపు మొదటి విడత రూ.40 లక్షలను కొంత వరకు రాయితీ మొత్తాన్ని అందించారు. ఆ తర్వాత 2019లో ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉల్లి రాయితీ పథకాన్ని అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి అటకెక్కించేశారు. విడుదల చేసిన నిధులను వెనక్కి లాక్కున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులు కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం చుట్టూ తమకు రావాల్సిన రాయితీ కోసం తిరుగుతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల్లో ఆశలు చిగురించాయి. ఉల్లి రాయితీ నివేదికను కమిటీ కార్యాలయం నుంచి ప్రభుత్వానికి పంపి నిధులను మంజూరు చేయిస్తామని ప్రజాప్రతినిధులు రైతులకు హామీ ఇస్తున్నారు.

మిగతా 6వ పేజీలో

గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఆర్థిక సాయం


- ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు
- ఎస్టీలకు రూ.75 వేలు
- పీవీటీజీలకు రూ.1.00 లక్ష అదనపు ఆర్థిక సాయం
- కలెక్టర్ పి. రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సాయం అందించనున్నట్లు కలెక్టర్ పి. రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం హౌసింగ్ లబ్ధిదారులకు అందజేయనున్న అదనపు ఆర్థిక సాయం అంశంపై కలెక్టర్ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి డిసెంబరు 10, 2024 తర్వాత నిర్మాణంలో పురోగతిలో ఉన్న ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులకు అదనపు ఆర్థికసాయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవోఆర్‌టీ.నెం.9 ఈ నెల 10-3-2025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.1లక్ష అదనపు ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. జిల్లాలో హౌసింగ్ కింద 39వేల వరకు ఇళ్లను మంజూరు కాగా, ఇందులో 22,590 ఇళ్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా 16,091 ఇళ్ల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. హౌసింగ్ పథకం కింద 9,446 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు ఉన్నారని, ఇందులో 4,028 మంది ఎస్సీలు, 5,170 మంది బీసీలు, 248 మంది ఎస్టీలు ఉన్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75వేలు, పీవీటీజీలకు అదనంగా రూ.1లక్ష ఇవ్వడం ద్వారా జిల్లాలో అదనంగా రూ.47.85 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. మరో రెండు రోజుల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, హౌసింగ్ ఇన్‌చార్జిల లబ్ధిదారుల ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సాయం గురించి వివరిస్తారన్నారు. ఇళ్ల స్థలం, ఇల్లు మంజూరు కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీలు జాగ్రత్త



- ఏటా 30 లక్షల మంది సీకేడీ బాధితులు
- అవగాహన పెంచుకోవాలంటున్న వైద్యులు
- ప్రతి ఏడాది కర్నూలు జీజీహెచ్‌కు 1800 ఓపీ రోగులు
- నేడు వరల్డ్ కిడ్నీ డే

కర్నూలు హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మారిన జీవనశైలి, సరైన పోషకాలు లేని ఆహారం తీసుకోకపోవడం, సమయానికి తినకపోవడం, నీరు తక్కువగా తాగడం, ఊబకాయం, బీపీ, మధుమేహం లాంటివి కిడ్నీ సమస్యలకు కారణమవుతున్నాయి. మూత్రపిండాలు మన శరీరంలో ముఖ్యమైన అవయవం. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసి శరీరభాగాలకు సరఫరా చేయడంలో కిడ్నీల పాత్ర గణనీయమైంది. ఎప్పటికప్పుడు రక్తంలో చేరే మలినాలను వడబోసి మూత్రం రూపంలో బయటకు పంపి మనిషి ఆరోగ్యాన్ని కాపాడుతాయి కిడ్నీలు. భారతదేశంలో 16 శాతం మంది కిడ్నీ వ్యాధి బాధితులు ఉన్నారు. కిడ్నీపై అవగాహన పెంచేందుకు ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డే నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది 30 లక్షల మంది ఈ వ్యాధితో మృతి చెందుతున్నారు. భారతదేశంలో 78 లక్షల మంది సీకేడీ (దీర్ఘకాలిక జబ్బు)తో బాధపడుతున్నారు. వారిలో ప్రతి సంవత్సరం 1.5 లక్షల మంది మరణిస్తున్నారు. కర్నూలు జీజీహెచ్ నెఫ్రాలజీ విభాగానికి ప్రతి ఏడాది 1800 మంది ఓపీ రోగులు వస్తున్నారు. ఇందులో 50 శాతం మంది డయాబెటిక్ రోగులు, 30 శాతం మంది బీపీతో బాధపడుతున్నవారు, 5 నుంచి 6 శాతం మంది పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్స్ వాడే వారు కిడ్నీ జబ్బుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు.

ఈ ఏడాది థీమ్

ఆహారం, జీవనశైలి మార్పులు కిడ్నీలకు హానీ కలిగిస్తున్నాయి. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజి ఈ ఏడాది మీ కిడ్నీలు బాగున్నాయా...? త్వరగా గుర్తించండి.. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోండనే నినాదం ఇచ్చింది.

దెబ్బతీస్తున్న పెయిన్ కిల్లర్స్

భారతదేశంలో ఏడు శాతం మంది పెయిన్ కిల్లర్స్ వాడి కిడ్నీలు పాడు చేసుకుంటున్నారు. నొప్పి నివారణ మందులను అతిగా వాడుతున్నప్పుడు కిడ్నీలు రక్తం వడపోత సామర్థ్యం తగ్గిపోతుంది. దీంతో రక్తపోటు పెరిగి కిడ్నీలు దెబ్బతింటాయి.

రెగ్యులర్‌గా పరీక్షలు

కిడ్నీ జబ్బు తొలిదశలో పెద్దగా లక్షణాలేవి కనిపించవు. అయినా ముందుగా గుర్తిస్తే జబ్బు రాకుండా చూసుకోవచ్చు. రక్తంలో యూరియా, క్రియాటిన్‌తోపాటు మూత్రాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించినట్లయితే ప్రారంభంలోనే వ్యాధిని గుర్తించవచ్చు. కిడ్నీ వైఫల్యం నాలుగు దశలో జరుగుతుంది. మొదటి, రెండు దశలు రక్తం, మూత్ర పరీక్షలు చేస్తే తప్ప లక్షణాలు కనిపించవు. డయాబెటిస్, బీపీ, అధిక బరువు, గతంలో కిడ్నీలో రాళ్లు ఉన్నవారు ముందస్తు పరీక్షలు చేయించుకోవాలి. మూడో దశలో కాళ్ల వాపు, రక్తహీనత, బీపీ లక్షణాలు కనిపిస్తాయి. నాలుగో దశలో దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగా ఉంటుంది.

జాగ్రత్తలు

- మధుమేహం,బీపీ అదుపులో ఉండాలి.
- మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు, మూత్ర వ్యవస్థలో సమస్యలను పరిష్కరించు కోవాలి.
- మద్యం, ధూమపానం అలవాట్లను మానుకోవాలి.
- మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.
- కిడ్నీ పనితీరు పది శాతం కంటే తక్కువకు పడిపోయినప్పుడు రోగికి డయాలసిస్ చేయించుకోవాలి.
- కిడ్నీలు ఆరోగ్యంగా ఉండడానికి ప్రతి రోజూ 7 నుంచి 8 గ్లాసుల నీటిని తాగాలి.
- జంక్‌ఫుడ్, నిల్వ ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలి.
- ఆహారంలో ఉప్పును తగ్గించుకోవాలి.
- బరువును అదుపులో ఉంచుకోవాలి. ఊబకాయలకు కిడ్నీ జబ్బు ముప్పు 2-7 రెట్లు ఎక్కువ ఉంటుంది.

కిడ్నీ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించాలి



కిడ్నీ వ్యాధిని ప్రారంభదశలోనే గుర్తించాలి. ఇందుకు మూత్ర పరీక్ష, సీరం క్రియాటిన్ పరీక్ష చేయించుకోవాలి. 40 ఏళ్ల పైబడిన వారు, కుటుంబంలో కిడ్నీ వ్యాధి చరిత్ర ఉన్న వారు బీపీ, షుగర్ ఉన్న వారు సంవత్సరానికి ఒకసారి పరీక్షలు చేయించుకోవాలి.

- డా.కే. అనంతరావు, నెఫ్రాలజిస్టు, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు



కర్నూలు జీజీహెచ్‌లోని నెఫ్రాలజిస్టులు

ఉప్పుతో ముప్పు



30 ఏళ్ల దాటిన తర్వాత కిడ్నీల పనితీరు ఏటా 10 శాతం తగ్గుతుంది. ఉప్పును ఎక్కువగా వాడితే సోడియం రక్తపోటును పెంచుతుంది. ఇది కిడ్నీలను దెబ్బతీస్తుంది. సాదారణ ప్రజలు 2 నుంచి 5 గ్రాముల ఉప్పు తీసుకోవాలి. సికేడీ రోగులు 2 గ్రాములలోపే తీసుకోవాలి.

- డా. సోమ అనంత్, నెఫ్రాలజీ విభాగాధిపతి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

రక్తపోటును నియంత్రించుకోవాలి



రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవాలి. రక్తపోటు 130/80 కన్నా మించకుండా చూసుకోవాలి. 30 ఏళ్ల లోపు ఉన్న వారిలో బీపీ ఉంటే 90 శాతం కిడ్నీ జబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది.

- డా.పీఎల్. వెంకట ఫక్కీరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ నెఫ్రాలజీ డిపార్ట్‌మెంటు, కర్నూలు జీజీహెచ్

నొప్పి మందులతో జాగ్రత్త



చీటికి మాటికి నొప్పి మందులను వేసుకోవద్దు. ఎలాంటి యాంటిబయాటిక్, పెయిన్ కిల్లర్స్ వైద్యుల సలహా లేకుండా వాడరాదు. ఇవి కిడ్నీలను దెబ్బతీస్తాయి. నెలలకు కిడ్నీ పరీక్ష చేయించుకోవాలి.

- డా. సిద్ధార్థ హెధూర్, నెఫ్రాలజిస్టు, మెడికవర్ హాస్పిటల్, కర్నూలు

ఉల్లి.. ఆశలు సన్నగిల్లి..!

(5వ పేజీ తరువాయి)

ఇదిలా ఉండగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతులకు మద్దతు ధర అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని ఇటీవల గుంటూరు మిర్చీ యార్డులో అభాండాలు వేయ డంపై ఉమ్మడి జిల్లా రైతులు మండిపడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో తమ కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తే.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ నిలిపేయడమే కాకుండా ఉల్లి రాయితీని కూడా అందించకుండా ఎగనామం పెట్టలేదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా తమకు అందాల్సిన ఉల్లి రాయితీని మళ్లీ తెప్పించేందుకు ఉమ్మడి జిల్లా ప్రతినిధులు సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తేవాలని వారు కోరుతున్నారు.

రాయితీ అందేసరికి ప్రాణాలు పోయేలా ఉన్నాయి

జిల్లాలో ఉల్లి రైతులు కన్నీటి కడలి ఈదుతున్నారు. పెట్టుబడి ఖర్చు కాదు కదా కనీసం పొలం నుంచి కర్నూలు మార్కెట్ యార్డుకు ఉల్లిని తెచ్చినందుకు అయిన ఖర్చు కూడా వ్యాపారి నుంచి లభించ కపోవడం వల్ల రైతులు లబోదిబో మంటున్నారు. అప్పులు పేరుకుపోతుండటం, కుటుంబ జీవనం భారం కావడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. పరిస్థితిని గుర్తించిన ప్రభుత్వం ఆగస్టు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు కర్నూలు యార్డులో ఉల్లిని విక్రయించిన రైతులకు క్వింటంపై రూ. 700 మద్దతు ధర అందించేందుకు ఆదేశాలు జారీ చేసింది. గిట్టుబాటు ధర అందించినందుకు రైతులు సంతోషించారు. రాయితీ డబ్బుల కోసం దరఖాస్తు చేసుకొనేందుకు వారు కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయానికి క్యూ కట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గోనెగండ్ల, డోన్, ఎమ్మిగనూరు, ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు, నందికొట్కూరు, పాణ్యం, ఆదోని, ఆత్మకూరు తదితర 30 మండలాల్లో ఉల్లిని రైతులు భారీగా సాగు చేస్తున్నారు. ఒక ఎకరా ఉల్లి పంట సాగుకు రూ.20వేలు ఖర్చు అయితే.. ప్రస్తుతం పెట్టుబడి ఖర్చులు రూ.50వేలు నుంచి రూ.60వేలకు పెరిగిందని ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అక్టోబరులో కర్నూలు మార్కెట్ యార్డుకు వేలాది క్వింటాళ్ల ఉల్లిని అమ్మకానికి రైతులు తీసుకుని వచ్చారు. వ్యాపారులు ఇదే సాకుగా చూపుతూ ధరను తగ్గించే ప్రయత్నం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సీఎం స్థాయిలో సీఎం చంద్రబాబు ఉల్లి రైతుల కష్టాలు తీర్చాలని, వెంటనే అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని మంత్రులను ఆదేశించారు. మంత్రి టీజీ భరత్‌తో పాటు జలవనరుల శాఖ మంత్రి ఉల్లి మార్కెట్ యార్డుకు చేరుకుని వ్యాపారులు, అధికారులతో చర్చలు జరిపారు. దీంతో వ్యాపారులు దిగివచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర అందడంతో వారు సంతోషించారు.

జిల్లాలో ఉల్లి రాయితీ వివరాలు (క్వింటాళ్లలో)

నెల	అర్హులు	విక్రయించిన ఉల్లి
ఆగస్టు	260	15798
సెప్టెంబరు	1014	18774
అక్టోబరు	1361	14799
నవంబరు	2449	169263
డిసెంబరు	1703	10651
జనవరి	1515	24390
ఫిబ్రవరి	1438	59462

రైతులకు అందాల్సిన రాయితీ రూ.6.45 కోట్లు.. ఇచ్చింది రూ.40 లక్షలే..

2019లో ఉమ్మడి జిల్లాలోని ఉల్లి రైతులు ధర పతనమై తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఆ సమయంలో 3,47,911 క్వింటాళ్ల ఉల్లిని రైతులు వ్యాపారులకు విక్రయించారు. రైతులకు క్వింటానికి వ్యాపారులు అందించిన మొత్తం కేవలం రూ.200 నుంచి రూ.400 మధ్యనే. రైతుల కన్నీటి వ్యథను తొలగించేందు కోసం అప్పట్లో ప్రభుత్వం ఉల్లి రాయితీ అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. క్వింటానికి రూ.700 మద్దతు ధరను ప్రకటించింది. క్వింటానికి వ్యాపారి రూ.300 చెల్లిస్తే.. ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రూ.400 రాయితీగా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం రాయితీ కోసం అప్పట్లో 9,740 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం నుంచి రూ.6.45 కోట్లు రాయితీగా అందించాల్సి ఉందని మార్కెట్ కమిటీ అధికారులు నివేదికను ప్రభుత్వానికి అందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోడుమూరులో పర్యటించిన సమయంలో 40 లక్షల దాకా రాయితీని రైతులకు అందించారు. 2019 ఆగస్టులో 260 మంది రైతులు 15,798 క్వింటాళ్లను విక్రయించారు. సెప్టెంబరులో 1,014 మంది రైతులు 18,774 క్వింటాళ్ల ఉల్లిని విక్రయించారు. అక్టోబరులో 1361 మంది రైతులు 14,799 క్వింటాళ్లను, నవంబరులో 2,449 మంది రైతులు 1.69 లక్షల క్వింటాళ్లను, డిసెంబరులో 1,703 మంది రైతులు 10,651 క్వింటాళ్లను అమ్ముకున్నారు. జనవరి నెలలో 1,515 మంది రైతులు 24,390 క్వింటాళ్లను, ఫిబ్రవరిలో 1438 మంది రైతులు 59462 క్వింటాళ్ల ఉల్లిని కర్నూలు మార్కెట్ యార్డులో విక్రయించారు. మొత్తం 3.47 లక్షల క్వింటాళ్లకు గాను ప్రభుత్వం రూ.6.45 కోట్లు 9,740 మంది రైతులకు రాయితీగా అందించాలని ప్రభుత్వానికి ఆనాటి కర్నూలు మార్కెట్ కమిటీ అధికారులు నివేదిక పంపించారు.



ఉల్లి రాయితీని రైతుకు అందించేందుకు కృషి



ఉల్లి రైతులకు 2019లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రాయతీని అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ రాగానే మంజూరైన నిధులను వెనక్కి తీసేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా రైతులు రాయితీ డబ్బుల కోసం కర్నూలు మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. కూటమి ప్రభుత్వం రావడం వల్ల రాయితీ డబ్బులు అందించేందుకు జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వం నుంచి నిధులను మంజూరు చేయిస్తాం.

- పెరుగు పురుషోత్తంరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం



జిల్లా ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రభుత్వానికి రైతులు చెల్లించాల్సిన ఉల్లి రాయితీ కోసం ప్రభుత్వానికి నివేదికను పంపిస్తాం. ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుంటాం. ఆందోళన వద్దు.

- జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోండి

మార్చి 31 చివరి తేదీ





వెల్దుర్తి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. భారతదేశంలోని టాప్-500 కంపెనీలలో యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడానికి అవకాశం కల్పిస్తోంది. ఇందుకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది..

అర్హులు..: భారతీయులై ఉండాలి. అప్లికేషన్ చేసే సమయానికి సర్టిఫికెట్ ప్రకారం వయస్సు 21 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదు. ఫుల్‌టైం ఉద్యోగిగా ఎక్కడ ఉండకూడదు. ఫుల్‌టైం ఎడ్యుకేషన్ ప్రస్తుతం చేస్తూ ఉండకూడదు. ఆన్‌లైన్ లేదా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ చేస్తున్న వారు అర్హులు. ఎస్ఎస్‌సీ, పాలిటెక్నిక్, ఐటీఐ, బీఏ, బీఎస్‌సీ, బీఫార్మా, బీబీఏ వంటి ఏదైనా డిగ్రీ ఉండాలి.

దరఖాస్తు విధానం

1. రిజిస్ట్రేషన్ ఇన్ పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పోర్టల్ (పీఎం ఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవీ.ఇన్)
2. ఇంటర్న్‌షిప్ అప్లికేషన్ ఇన్ పీఎం ఇంటర్న్‌షిప్ స్కీమ్ పోర్టల్
3. యాక్సెప్ట్ ఫ్రమ్ కంపెనీస్

దరఖాస్తుకు అవసరమయే డాక్యుమెంట్లు..

1. పదవ తరగతి సర్టిఫికెట్ మరియు పైన తెలిపిన డిగ్రీ సర్టిఫికెట్లు
2. ఆధార్ కార్డు నెంబరు 3. ఆధార్‌కార్డు లింక్ అయిన మొబైల్ నెంబరు 4. ఈమెయిల్ ఐడీ వెరిఫికేషన్

నీలిమ..సహాయ కార్మిక అధికారి

సొంత రాష్ట్రంలో దగ్గర్లో ఉన్నటువంటి స్థానంలో కూడా దరఖాస్తు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ దరఖాస్తు మాకు పంపాలి. సెలక్షన్ అయిన వారి ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. నేరుగా వారి లాగిన్ ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో సెలక్షన్ ఆర్డర్ కాపీని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రయోజనాలు..

1. అర్హత సాధించిన వారికి జాయినింగ్ ముందు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.6 వేలు నేరుగా ఆధార్ కార్డు లింక్ అయిన బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి.
2. ఇంటర్న్‌షిప్ ప్రారంభమైన తర్వాత ప్రతి నెలా ఏ కంపెనీలో జాయిన్ అవుతారో ఆ కంపెనీ ద్వారా రూ.500 నగదు ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారి బ్యాంకు ఖాతాలో జమ అయిన తరువాత కేంద్ర ప్రభుత్వం ద్వారా మిగిలిన రూ.4500 నగదు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. మొత్తం ఒక నెలకు రూ.5 వేలు నగదు బ్యాంకు ఖాతాలో ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారి ఖాతాలో జమ అవుతాయి.
3. జాయిన్ అయిన సంవత్సర కాలంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన

   పథకాలు రెండు కూడా సెలక్ట్ అయిన వారి పేరుపై ప్రభుత్వం ఆటోమెటిగ్గా మొదలుపెడుతుంది. ఇది సంవత్సరకాలం ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారిపై ఉంటుంది.
4. ఒక సంవత్సరం పూర్తయిన తర్వాత కంపెనీ వారిచ్చే సర్టిఫికెట్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలలో ప్రాధాన్యత ఉంటుంది.

సిరిమల్లె

- లాభదాయకంగా మల్లెపూల సాగు
- రోజుకు 230 కేజీల దిగుబడి
- పది రోజులకే రూ.లక్ష ఆదాయం
- ఆదర్శంగా నిలిచిన కౌలు రైతు ఉసేన్‌బాషా

చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన కౌలు రైతు ఉసేన్‌బాషా మల్లె పూల సాగులో రికార్డు సాధించి ఆదర్శంగా నిలిచాడు. రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని మల్లె పూల తోట సాగు చేశాడు. రెండు ఎకరాలకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. రోజుకు 250 కేజీల మల్లె పూలు కోతకు వస్తున్నాయి. కేజీ రూ.350 పలకడంతో పది రోజుల్లోనే రూ.4 లక్షలు వచ్చింది. కౌలు, కూలీలు పోను రూ.లక్ష ఆదాయం వచ్చింది. తన కష్టానికి తగ్గ ఫలితం వచ్చిందని కౌలు రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఈ ఏడాది మొదటి కోతలోనే రూ.లక్ష ఆదాయం వచ్చిందని తెలిపారు. గత ఏడాది సరైన ధర లేక మల్లె పూలతో నష్టపోవాల్సి వచ్చిందని, ఈ ఏడాది మొదటి కోతలోనే దిగుబడి అధికంగా రావడంతోపాటు ధర కూడా ఆశించిన స్థాయిలో ఉండటంతో మంచి ఆదాయం వచ్చిందని అన్నారు.



చాగలమర్రిలో మల్లెపూలు కోస్తున్న మహిళా కూలీలు



దిగుబడి బాగుంది



రెండు ఎకరాల్లో మల్లె తోట సాగు చేశా. ఏటా ఎకరాకు లక్ష లాభం వస్తోంది. మంచి ధర ఉంటే రూ.2 లక్షలు పైగా వస్తుంది. తోటలను కంటికి రెప్పలా చూసుకోవాలి. తరచూ నీటిని అందిస్తూ తెగుళ్లను నివారించి పంటను కాపాడుకోవాలి. ఎనిమిది నెలల పాటు దిగుబడి వస్తుంది. చాగలమర్రిలో వ్యాపారులు పూలమండీలు ఏర్పాటు చేయడంతో మార్కెట్‌కు ఇబ్బంది లేదు. మొదటి కోతలోనే పెట్టుబడి, కౌలు పోగా రూ.లక్ష ఆదాయం వచ్చింది.

- ఉసేన్‌బాషా, కౌలు రైతు, చాగలమర్రి

సహకార సంఘాలను ఆదుకుంటాం

- ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ బీఎస్ నవీన్ కుమార్

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం, గ్రామాల్లోని సహకార సంఘాల బలోపేతం వంటి కార్యక్రమాలను వేగవంతం చేసి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటామని ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ బీఎస్ రవికుమార్ ప్రకటించారు. బుధవారం కర్నూలు నగరంలోని మత్స్య సహకార సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను, వివరించారు. మత్స్య సహకార సంఘాల్లో సభ్యులకు త్వరలోనే బైలాలను తెలుగులోకి అనువదించి పంపిణీ చేస్తామని ప్రకటించారు. డైరెక్టర్లు శేఖర్, నాగశేషులు, శ్రీనివాసులు, మల్లీశ్వరుడు, మద్దిలేటి, నగేష్ పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు..

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కుమార్తెను వైద్యురాలిగా చూడాలనుకున్న తండ్రి ఆకస్మికంగా మృతి చెందాడు. ఆ దుఃఖాన్ని దిగమింగుకుని తండ్రి కష్టాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన ఆశను నిజం చేసేందుకు కూతురు పరీక్ష కేంద్రానికి వెళ్లింది. ఈ ఘటన నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన విద్యార్థిని లక్ష్మీదేవి వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ విభాగంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తండ్రి నాగేశ్వరరావు మంగళ వారం రాత్రి మృతి చెందాడు. అంత్యక్రియలకు ముందు విద్యార్థిని లక్ష్మీదేవి పుట్టెడు దుఃఖంతో పరీక్షా కేంద్రానికి వెళ్లి ఫిజిక్స్ పరీక్ష రాసి వచ్చింది. ప్రిన్సిపాల్ మల్లేశ్వరరెడ్డి, అధ్యాపకులు విద్యార్థిని లక్ష్మీదేవికి ధైర్యం చెప్పి ప్రోత్సహించారు.



పరీక్షకు హాజరైన విద్యార్థిని లక్ష్మీదేవి

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

వెలుగోడు మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కానిస్టేబుల్ రవికుమార్ (40) గుండెపోటుతో మృతి చెందారు. 2009 బ్యాచ్‌కు చెందిన రవికుమార్ వెలుగోడు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవలే చాగలమర్రి పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అయితే ప్రస్తుతం ఆయన కుటుంబం వెలుగోడులోనే నివాసం ఉంటోంది. బుధవారం సాయంత్రం వెలుగోడులోని నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. రవికుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన ఆళ్లగడ్డకు తరలించారు.



రవికుమార్ (ఫైల్)

మహిళ ఆత్మహత్య

బండిఆత్మకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతజూటూరు గ్రామానికి చెందిన కృష్ణవేణి (40) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. బుధవారం ఉదయం కడుపునొప్పి తాళలేక రసాయనిక ద్రవం తాగి, తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు నంద్యాల ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మృతి చెందిదారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కృష్ణవేణికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

బేతంచెర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ఎస్ రంగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని మధులత (16) ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన తిరుమలేష్‌రెడ్డి, లావణ్య దంపతుల పెద్ద కుమార్తె మధులత బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు. అయితే తల్లిదండ్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



మధులత(ఫైల్)

ట్యాంకుపై నుంచి దూకి యువకుడు..

సంజామల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఓవర్ హెడ్ ట్యాంకుపై నుంచి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఎగ్గోని గ్రామంలో బుధవారం జరిగింది. కడప జిల్లా ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామానికి చెందిన కర్నాటి హర్షవర్ధన్ రెడ్డి (30) ఎగ్గోని గ్రామంలో ఉన్న తన సోదరి శ్రావణి వద్దకు వచ్చి వెళ్తుండేవాడు. హర్షవర్ధన్ మద్యానికి బానిసై లివర్ పాడైపోయింది. నిత్యం ఆసుపత్రిలో చూపించుకుంటున్నా నయం కాకపోవడంతో గతంలో రెండు పర్యాయాలు ఆత్మహత్యాయత్నం చేశారు. రెండు రోజుల క్రితం ఎగ్గోనిలోని సోదరి శ్రావణి ఇంటి వద్దకు వచ్చిన హర్షవర్ధన్ రెడ్డి గ్రామం వెలుపల ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు ఎక్కి పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సోదరి శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

అప్పుల బాధతో రైతు..

కౌతాళం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): మండలం లోని ఎరిగేరి పంచాయతీలోని మజరా గ్రామ మైన లక్ష్మీనగర్‌కు చెందిన ఓ రైతు బుధవారం అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలివీ.. ఉలిగప్ప(60) తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు కౌలుకు మరో 8 ఎకరాలు తీసుకుని మిరప సాగు చేశారు. గిట్టుబాట ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా రాలేదు. అప్పులు అంతకంతకు పెరిగిపోయాయి. రూ.5 లక్షల అప్పులు ఎలా తీర్చా లోనని మనస్తాపానికి గురయ్యారు. బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఉలిగప్పకు ఆరుగురు ఆడపిల్లలు సంతానం. ఉలిగప్ప భార్య ఆనందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు కౌతాళం ఏఎస్ఐ రమణారెడ్డి తెలిపారు.



ఉలిగప్ప(ఫైల్)

ఎల్‌టీ క్యాడర్‌ను జోనల్‌గా మార్చాలి

కర్నూలు హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ క్యాడర్‌ను జిల్లా క్యాడర్ నుంచి జోనల్ క్యాడర్‌గా మార్చాలని ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రఘుబాబు డిమాండ్ చేశారు. గురువారం ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని విభాగాల్లో కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్స్‌కు సమాన పనికి సమాన వేతనం వంద శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలన్నారు. 2022 నుంచి పీహెచ్‌సీ, ఓపీహెచ్‌సీలలో కొత్త పరికరాలు సమకూర్చారు. 63 రకాల పరీక్షలు చేసి ఒత్తిడి నెలకొందని, వీటితోపాటు టీబీ, హెచ్ఐవీ పరీక్షల నిర్వహణ ఎల్‌టీలు చేయడం కష్టంగా ఉందన్నారు. అందువల్ల రెండో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు మంజూరు చేసి భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



రఘుబు(ఫైల్)

దోపిడీకిపోయి దొరికిపోయారు..!

- చిత్తూరు ఘటనలో నంద్యాల జిల్లా నేరస్థులు



దుండగులను చితకబాదుతున్న స్థానికులు



దుండగులను వ్యాన్‌లో తీసుకెళ్తున్న పోలీసులు

నంద్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కేంద్రంలో ఓ దొంగల మూరా బుధవారం హల్ చేసింది. ఈ ఘటనలో నంద్యాల జిల్లా దొంగలు ఉండడంతో ఇక్కడ కలకలం రేగింది. సదరు ముఠాలోని కీలక నేరస్థుడు సుబ్రహ్మణ్యం అలియాస్ మాణ్యాలు నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన వాడు. ఇతనితోపాటు నంద్యాలకు చెందిన నవీన్ అనే మరో దొంగ కూడా పోలీసులకు పట్టుబట్టాడు.

ఫర్నీచర్ షాపు పేరుతో రూ.కోట్లలో అప్పులు

నంద్యాల జిల్లా కేంద్రంలో ఓ ఫర్నీచర్ దుకాణం పెట్టాడు. కంతుల వారీగా ఫర్నీచర్ వ్యాపారానికి తెరలేపాడు. ఈ క్రమంలో పెద్దఎత్తున ఖాతాదా రులు నగదు చెల్లించారు. సదరు నగదుతో రియల్ ఎస్టేట్ తదితర వ్యాపారాలు చేసి సొమ్ము చేసుకు న్నారని సమాచారం. అయితే ఏం జరిగిందో.. ఏమో కానీ.. ఆ తర్వాత.. రూ. కోట్లలో ఐపీ పెట్టి 2013 తర్వాత ఇక్కడి నుంచి చిత్తూరుకు మాకాం మార్చా రని తెలిసింది. అక్కడ కూడా ఇదే తరహాలో పలు రకాలు వ్యాపారులు చేసి రూ.కోట్లలో అప్పులు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే దొంగత నాలకు తెరలేపారు. తాజాగా చిత్తూరులో దొంగతనానికి వ్యూహం రచించారు.

వ్యాపార సమయంలో పరిచయం..

చిత్తూరులో దొంగతనం చేయడానికి వెళ్లిన యజమానితో సదరు నేరస్థుడికి పలు వ్యాపార సమయాల్లో పరిచయం ఏర్పడినట్లు తెలుస్తోంది. సదరు కిడ్డీ షాపు యజమాని కదలికలపై రెక్కి నిర్వహించి ఈ దొంగతనానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇందులో ఇరువురి మధ్య ఏమైనా వ్యాపార లావాదేవీల్లో తేడాలు ఉన్నాయా అన్న అనుమానాలు లేకపోలేదు.

కీలక నేరస్థుడిపై 2005 లోనే హత్య కేసు

సదరు ముఠా లోని కీలక నేరస్థుడు సుబ్రహ్మ ణ్యంది నంద్యాల జిల్లా కేంద్రం లోని ఓ కాలనీ. అయితే ఇదే కాలనీలోని ఓ రాజకీయ నాయకుడికి ప్రధాన అనుచరుడిగా ఉండేవాడు. సదరు నేరస్థుడికి ఆ నాయకుడు అండగా ఉండేవాడు. అయితే తనకు ఎదురే లేకుండా ఉండాలని సదరు నాయకుడిని కూడా అంతమొందించాడు. కర్నూలు జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన నేరచరిత్ర కలిగిన ముఠాకు సుఫారి ఇచ్చి హత్య చేయించాడు. 2005లో జరిగిన ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. దీంతో అప్పట్లో సదరు నేరస్థుడిపై హత్య కేసు నమోదైంది. ఇక అప్పటి నుంచి ఆ నేరస్థుడంటే నగరంలో అందరికీ భయం అనే చర్చ కొనసాగింది. ఇదే భయాన్ని ఆసరాగా చేసుకొని ఆ నేరస్థుడు వ్యాపారాల్లో దిగాడు.

పోలీసుల దర్యాప్తు ముమ్మరం

ఉదయం నుంచి చిత్తూరు దొంగల ముఠా కలకలం రేగడంతో జిల్లాల పోలీసులు సదరు ముఠా దొంగల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. అక్కడి పోలీసులు ఐదుగురు నిందితుల్ని అదుపులోకి తీసుకోగా మరికొందరు పరారయ్యారు. పరారైన వారిలో ఒకరు నంద్యాల జిల్లా కేంద్రంలోని తన సమీప బంధువైన ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేశాడు. ఈ నేపథ్యంలో పసిగట్టిన పోలీసులు ఫోన్ చేసిన నేరస్థుడితో పాటు.. ఆటోడ్రైవర్ కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు.

'బనవాసి' విద్యార్థినులకు అస్వస్థత

- తీవ్ర జ్వరంతో బాధపడుతున్న విద్యార్థినులు
- పరామర్శించిన సబ్ కలెక్టర్



ఆసుపత్రిలో విద్యార్థినులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌మీడియెట్ పరీక్ష వేళ సమయంలో మండల పరిధిలోని బనవాసి గురుకుల కళాశాల విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని బనవాసి ఏపీఆర్‌జేసీ గురుకుల బాలికల కళాశాలలో చదువుతున్న మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఉదయం దాదాపు 25 మంది వరకు తీవ్ర జ్వరానికి గురయ్యారు. దీంతో స్థానికంగా ఉన్న వైద్య సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందించారు. దీంతో కొంత మందికి జ్వరం తగ్గుముఖం పట్టగా మరో పది మంది విద్యార్థిపేలకు జ్వరం తగ్గకపోవడంతోపాటు అస్వస్థతకు గురయ్యారు. దీంతో కళాశాల సిబ్బంది విద్యార్థినులను మధ్యాహ్నం 3గంటల సమయంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రి డ్యూటీ వైద్యులు డాక్టర్ మల్లికార్జున విద్యార్థినులకు చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న సబ్ కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో మాట్లాడి జ్వరం రావడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జ్వరం, జలుబు వల్ల విద్యార్థినులు కొంత ఇబ్బందికి గురయ్యారని అన్నారు. అయితే విద్యార్థినులకు ఎలాంటి ప్రమాదం లేదని, బాగానే ఉన్నారని తెలిపారు. విద్యార్థినులకు మంచి వైద్యం అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కళాశాల సిబ్బందితోపాటు, వైద్య, రెవెన్యూ సిబ్బంది ఆస్పత్రిలో ఉండి విద్యార్థినులను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ఎండలు ఎక్కువగా ఉండడంతో కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు రేకుల షెడ్డులో ఉన్న డార్మెటరీల్లో చదువుకోవడం, చెట్ల నీడలోని వేడిగాలులకు కూర్చోవడం వల్ల అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

భవన నిర్మాణానికి 24 గంటల్లో అనుమతి

- ప్రాంతీయ పట్టణ ప్రణాళిక జోనల్ డీడీ విజయభాస్కర్

కర్నూలు న్యూసిటీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం రోజులు తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదని, దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లో అనుమతి పొందవచ్చని ప్రాంతీయ పట్టణ ప్రణాళిక జోనల్ డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక ఎస్‌టీబీఐ కాలనీలోని నగర పాలక సమావేశ భవనంలో ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల పట్టణ ప్రణాళికా విభాగ అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్సుడ్ ఇంజనీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణాలకు అనుమతుల్లో జాప్యాన్ని నిరోధిస్తూ ప్రభుత్వం కొత్తగా పథకం తెచ్చిందన్నారు. తద్వారా దరఖాస్తు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన గంటల వ్యవధిలో అనుమతులు పొంది పనులు ప్రారంభించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ శోభన్‌బాబు, జిల్లా డీటీసీపీఓ శశిలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయభాస్కర్

వైసీపీ దొంగాటను ప్రజలు నమ్మరు

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్



హుశేనాపురంలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఓర్వకల్లు మార్చి 12, (ఆంధ్రజ్యోతి): యువత పోరు పేరుతో వైసీపీ మరో దొంగాటకు తెర తీసిందని, దాన్ని ప్రజలు నమ్మరని టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ విమర్శించారు. బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో వైసీపీ యువపోరు పేరుతో నిర్వహించిన ధర్నా కార్యక్రమాన్ని ఆయన ఖండించారు. హుశేనాపురంలో మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు యువత భవిష్యత్తును సర్వనాశనం చేసి పోరుబాట సాగిస్తే ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరన్నారు. ఐదేళ్లలో వైసీపీకి గుర్తుకురాని ఫీజు రీయంబర్స్‌మెంటు ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని ప్రశ్నించారు.

రూ.4.271 కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంటు వసతి దీవెన బకాయిలు పెట్టింది జగన్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. 2014-19లో చంద్రబాబు ప్రభుత్వం 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు ఇస్తే.. జగన్ ప్రభుత్వం కుదించి 9 లక్షల మందికి మాత్రమే ఇచ్చి మిగతా వారికి అన్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ బాషా, కేవీ మధు, రాము, జీకే సుధాకర్, కాటినేని నారాయణ, గువ్వ రవికుమార్, బజారు, జయకృష్ణ, నారాయణ, రామగోవిందు, వేణు, రజాక్ పాల్గొన్నారు.

భూ సమస్యలపై శ్రద్ధ చూపండి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): సెక్షన్ 22ఏ1 భూములు, చుక్కల భూముల పరిష్కారంపై స్వీకరించిన అర్జీలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌తో కలిసి నిషేధిత జాబితాలోనుంచి చుక్కల భూముల తొలగింపుపై జిల్లాస్థాయి స్క్రూటిని కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సెక్షన్ 22ఏ1 భూములు, చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు 24 దరఖాస్తులను స్వీకరించారని, ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ భూములను పరిశీలించి అర్హతను బట్టి నిషేధిత జాబితాలో నుంచి డీ నోటిఫై చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, డోన్ ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారితో చర్చిస్తున్న కలెక్టర్ రాజకుమారి

కాటేసిన కరెంటు తీగలు

అవుకు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లె గ్రామంలో విద్యుదాఘాతంతో చిన్నతిమ్మిగాళ్ల వేణుగోపాల్ (36) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వేణుగోపాల్ స్వగ్రామం బేతంచెర్ల మండలం బలపాలపల్లె గ్రామం. జీవనాధారం కోసం మూడు సంవత్సరాల క్రితం కుటుంబంతో అవుకు వచ్చి స్థిరపడ్డాడు. కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఉదయం చెన్నపల్లె గ్రామంలోని సీపీ మహేశ్వరరెడ్డి ఇంటి పైభాగంలోని సిమెంట్ స్లాబ్‌ను పగుల గొట్టేందుకు వేణుగోపాల్ కూలి పనికి వెళ్లాడు. పని చేస్తున్న క్రమంలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు ప్రమాదమశాత్తు తగిలి మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ఎల్లమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

ఆర్‌యూలో సీఐడీ విచారణకు రంగం..?

- వీసీని హెచ్చరించిన ఉన్నత విద్యామండలి



కర్నూలు అర్బన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో సీబీ సీఐడీ విచారణకు రంగం సిద్ధమవుతోందని సమాచారం. పదేళ్లుగా కొన్ని కీలక ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించి ఓచర్స్, ఫర్నిచర్ మిస్సింగ్, కీలక ఫైళ్ల దొంగతనాలు, తదితర అంశాలకు సంబంధించి గతంలో విజిలెన్స్ కేసులు నమోదయ్యాయి. వీటిపైన విచారణ చేసుకోవాలని 26వ పాలక మండలిలో అనుమతులు కూడా ఇచ్చారు. కానీ ఇంత వరకు కేసులో పురోగతి లేకపోవడంతో ఈ కేసుల పైన సీఐడీ రంగంలోకి దిగుతున్నట్లు తెలిసింది. ఇందులోభాగంగానే విజయవాడ సీఐడీ వర్సిటీలోని అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. వీటిపైన ఉపకులపతి డాక్టర్ వెంకట బసవరావును వివరణ కోరగా ఉన్నత విద్యామండలి జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించిన మాట వాస్తవమేనని, సీఐడీ గురించి తనకు సమాచారం లేదని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యాశాఖ మంత్రికి కొందరు అధికార పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పెండింగ్ కేసులపై విచారణ చేసి వర్సిటీలో ప్రశాంత వాతావరణం నెలకొల్పే దిశగా చర్యలు తీసుకోవాలని కోరిన విషయం తెలిసిందే. పెండింగ్ కేసులను వెంటనే పూర్తి చేసి వర్సిటీలో పాలనను గాడిలో పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి వేసీ ఉన్నత విద్యామండలితో పాటు, సీబీసీఐడీకి మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఇదే అంశంపై ఓ విద్యార్థి సంఘం నాయకుడు లోకాయుక్తాను ఆశ్రయించారు. ఈ క్రమంలోనే సీబీసీఐడీ అంశం వర్సిటీలో ప్రొఫెసర్లు, విద్యార్థులు, ఉద్యోగుల మధ్య చర్చనీయాంశంగా మారింది.

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

బండిఆత్మకూరు, మార్చి12(ఆంధ్రజ్యోతి): హోటళ్లు, వివిధ దుకాణదారులు రోడ్లపై చెత్త, మురుగు నీరు పోయకూడదని, అందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి సూచించారు. బుధవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో పలువురికి నోటీసులిచ్చారు. ఆమె మాట్లాడుతూ అపరిశుభ్రత కల్పిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యదర్శులు అక్బర్, చక్రధర్ ఉన్నారు.

మహానంది: దుకాణదారులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ అన్నారు. బుధవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురం గ్రామంలోని దుకాణదారులు తమ షాపుల వద్ద డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని చెప్పారు.

'ఇంటి నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలి'

బండిఆత్మకూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను మే నెల చివరిలోగా పూర్తయేల్యాలా చూడాలని ఎంపీడీవో దస్తగిరి సూచించారు. బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 20 గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఆగిపోయిన 371 ఇళ్లకు ప్రభుత్వం అదనపు సాయం అందించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇస్తుందని చెప్పారు. ఏఈ వాసుదేవుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు చెన్నయ్య, హరిప్రసాద్, హరి పాల్గొన్నారు.

'పంట మార్పిడి చేసుకోవాలి'

వెలుగోడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో నేల ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ సూచించారు. బుధవారం వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఏడీఏతో పాటు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గోవింద నాయక్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏవో పవన్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'అండర్ పాస్ బ్రిడ్జి వద్దు'



ఎర్రగూడూరులో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

పాములపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగూడూరు గ్రామంలో హైవే నిర్మాణపు పనుల్లో భాగంగా తలపెట్టిన అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణపు పనులు వద్దని, గామాభివృద్ధిని అడ్డుకోవద్దంటూ గ్రామస్థులు హైవేపై నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ప్రజలు మాట్లాడుతూ గ్రామంలో కొంతమంది వ్యక్తులు నేషనల్ హైవే అలైన్‌మెంట్‌లో లేని అండర్‌పాస్ బ్రిడ్జిని నిర్మించాలని రాజకీయ పలుకుబడితో పట్టుబట్టడం సమంజసం కాదని అన్నారు. నేషనల్ హైవే సేఫ్టీ కమిటీ సూచనలు పక్కకు పెట్టి అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణానికి మొగ్గు చూపడం దారుణమన్నారు. పాత డీపీఆర్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని, పొలాలకు, శాంతినిలయం గ్రామం వెళ్లేందుకు రహదారి నిర్మించాలని, ఏ ఊరిలో మారని అలైన్‌మెంట్ తమ ఊరిలో మాత్రమే ఎందుకు మారుతుందని ప్రశ్నించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

పాములపాడు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామంలో ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ రవి కుమార్ గ్రామ ప్రజలకు క్షయ నివారణపై అవగాహన కల్పించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోషకాహారం లోపం ఉంటే వయస్సు, లింగ తారతమ్యం లేకుండా టీబీ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే మందులు ఉచితంగా అందిస్తారని తెలిపారు.

పాఠశాల ఉద్యోగికి బెదిరింపులు

పాణ్యం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ఏపీ గురుకుల పాఠశాల ఉద్యోగిని బెదిరించిన ఘటనపై పాణ్యం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు పాఠశాల ఉద్యోగి బాలకృష్ణ తెలిపారు. ఈ నెల 10వ తేదీన పాణ్యం గ్రామానికి చెందిన దేవరకొండ గణేష్ అనేవ్యక్తి తన అనుచరులతో పాఠశాలలోకు వచ్చి తనకు బయటికి రావాలని అసభ్య పదజాలంతో దూషించినట్లు బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. గణేష్‌కు, భార్యకు మధ్య గత కొంత కాలంగా కోర్టులో కేసు నడుస్తోంది. గణేష్ భార్యకు బాలకృష్ణ మేనమామ కావడంతో ప్రతికోజూ కేసు వాపసు తీసుకోవాలని గణేష్ బెదిరిస్తున్నారన్నారు. కట్నం డబ్బు తన భార్య ఇవ్వలేదని ఈ విషయాన్ని మాట్లాడాలని, లేకపోతే చంపుతామని బెదిరిస్తున్నారు. గత ఏడాదిగా తనను బెదిరిస్తున్నారు. గణేష్ వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణ హానీ ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. దీనిపై పాణ్యం పోలీసులను వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, గణేష్‌ను పిలిపించి విచారించామని, బయట పంచాయతీ చేసుకుంటామని వెళ్లినట్లు తెలిపారు.

'ప్రజా వినతులపై సత్వరమే స్పందించాలి'

నంద్యాల రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా వినతులకు సత్వరమే సమాధానం ఇవ్వాలని డీఎల్‌డీవో సుబ్బారెడ్డి సూచించారు. బుధవారం చాపిరేవుల సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వర్క్ ఫ్రం హోం ఇంటింటి సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

'పార్టీ కోసం పని చేసిన వారికే పదవులు ఇవ్వాలి'

కొత్తపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులను న్యాయం చేయాలని కొత్తపల్లి మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ చైర్మన్ రామచంద్రారెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్ చిన్న పుల్లారెడ్డి, టీడీపీ నాయకులు నాగశేషన్న యాదవ్ టీడీపీ అధిష్ఠానాన్ని కోరారు. బుధవారం వారు కొత్తపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇతర పార్టీల నుంచి టీడీపీలోకి వచ్చిన వారిని కాకుండా పార్టీని నమ్ముకుని ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న నిజమైన కార్యకర్తలకు నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పించాలన్నారు.

'వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి'

పగిడ్యాల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెహ్రూనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని టీడీపీ నాయకులు లోకానందరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 56 మంది విద్యార్థులకు టీడీపీ నాయకురాలు మాండ్ర ఉమాదేవి సహకారంతో టీడీపీ నాయకులు లోకానంద రెడ్డి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్‌ను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. పాఠశాలలో 1, 2, 3 స్థానాల్లో మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు వెండి పతకాలు అందజేస్తామన్నారు. నందమూరి బాలకృష్ణ, మోక్షజ్ఞ సేవా సమితి అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు, టీడీపీ నాయకుల ఫరూక్ బాషా, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, స్వామినాథమ్, విజయభాస్కర్, బెంజిమెన్, ఉపాధ్యాయినులు విజయకుమారి, భార్గవి, జయలక్ష్మి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

ఆత్మకూరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ముష్టపల్లి గ్రామంలోని పీహెచ్‌సీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి అంధత్వ, దృష్టిలోపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కంటి వైద్యనిపుణుడు డా.షేక్షావలి,ఎంఎల్‌హెచ్‌పీ అహ్మద్‌బాషా, ఆరోగ్య కార్యకర్త ఇందిరా ప్రభావతి, ఆశాలు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు

- బైరవాణి చెరువుపై అక్రమార్కుల కన్ను
- అడ్డుకున్న గోపవరం గ్రామస్థులు



చెరువులో మట్టి తవ్విన ప్రాంతం

మహానంది, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం సమీపంలోని బైరవాణి చెరువుపై అక్రమార్కుల కన్ను పడింది. అధికారుల అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు టీడీపీ నాయకులతో చేతులు కలిపి బుధవారం మట్టి తవ్వకాలు చేపట్టారు. బైరవాణి చెరువు వద్దకు ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో చేరుకొని అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టారు. ఈ విషయాన్ని గమనించిన గ్రామస్థులు అక్కడికి చేరుకొని తవ్వకాలను అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు మట్టి మాఫియా, గ్రామస్థుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎలాంటి అనుమతులు లేకుండా



ఎక్స్‌కవేటర్‌తో మట్టిని తవ్వుతున్న దృశ్యం

చెరువును తవ్వరాదని ప్రజలు అక్కడే భీష్మించుకొని కూర్చున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అక్రమ మట్టి తవ్వకాలను నిలిపి వేశారు.

వేసవి వస్తే పండగే

వేసవి కాలంలో చెరువుల్లో నీటి నిల్వలు తగ్గుతాయి. ఇదే అదునుగా భావించిమట్టి మాఫియా చెరువుల్లోని విలువైన సారవంతమైన మట్టిని అక్రమంగా తవ్వి నంద్యాల సమీపంలోని ఇటుకల బట్టీలకు తరలించి లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకొని మట్టి మాఫియాకు చెందిన కొందరు అలవాటు చేసుకున్నారు.

అనుమతులు ఇవ్వలేదు

గోపవరం బైరవాణి చెరువులో మట్టి తవ్వకాలకు రెవెన్యూ శాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదు. కచ్చితంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

రమాదేవి, తహసీల్దార్

శాస్త్రోక్తంగా కామ దహనం



కామ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, అధికారులు

శ్రీశైలం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో ఫాల్గుణ శుద్ధ చతుర్దశిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం 6.30 గంటలకు కామదహన కార్యక్రమాన్ని దేవస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించింది. ప్రధానాలయం ముందు భాగంలోని గంగాధర మండపం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీసేవలో భాగంగా ఉత్సవమూర్తులను గంగాధర మండపం వద్దకు తీసుకొచ్చి శాస్త్రోక్తంగా పూజలు జరిపారు. తరువాత మన్మథ రూపాన్ని దహనం చేశారు. ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, శ్రీస్వామివార్ల ప్రధానార్చకులు కె. శివప్రసాద్ స్వామి, అధ్యాపక ఎం. పూర్ణానందఆరాధ్యులు, ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావు, పర్యవేక్షకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు. కామదహనం భద్రతా ఏర్పాట్లను స్థానిక సీఐ ప్రసాదరావు, దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ కె. అయ్యన్న పర్యవేక్షించారు.

త్వరలో బహిరంగ వేలం

నందికొట్కూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని సుంకులా పరమేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి సంబంధించిన దుకాణాలకు వారం రోజుల్లో బహిరంగ వేలం నిర్వహిస్తామని దేవదాయశాఖ సీనియర్ ఇనిస్పెక్టర్ హరిచంద్రారెడ్డి తెలిపారు. నందికొట్కూరు ఈవో వెంకటరమణపై టీడీపీ, బీజేపీ, విశ్వహిందూపరిషత్, ఆలయాల కమిటీ నాయకులు చేసిన ఫిర్యాదుపై నంద్యాల జిల్లా దేవాదాయశాఖ సీనియర్ ఇనిస్పెక్టర్ హరిచంద్రారెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. లెక్కలను తేల్చాలని ఆలయకమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆంజనేయస్వామి ఆలయం విషయంలో కూడా అవకతవకలు జరిగాయని వారు ఆరోపించారు.

భూసారంతో అధిక దిగుబడి: డీఏవో

గడివేముల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భూమి సారవంతంగా ఉండటం వల్ల నాణ్యతతో కూడిన పంటలు, అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గడిగరేవుల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకుడు రాజశేఖర్, ఏవో హేమసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆత్మకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల, పట్టణాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. ఆతర్వాత నంద్యాల టర్నింగ్‌లోని వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

'చెంచుల గృహ నిర్మాణానికి సహకారం'

సున్నిపెంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ నిరుపేద చెంచులకు పీఎం జనమన్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.2,39,0000 ఆర్థిక సహాయం అందిస్తున్నాయని ఐటీడీఏ పీవో వెంకట శివప్రసాద్ తెలిపారు. , ఈ మొత్తంతో పాటు చెంచులకు అదనంగా రూ.లక్ష ఆర్థిక అదిస్తున్నట్లు తెలిపారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను గానీ, మండల స్థాయి హౌసింగ్‌లోని అసిస్టెంట్ ఇంజనీర్ గానీ సంప్రదించాలన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన వేడుకలు



చండీ యాగంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూరురూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలం కురుకుంద గ్రామంలో వెలసిన కురుకులాంబమాత జయంతి వేడుకలను భక్తజనసందోహం నడుమ బుధవారం వైభవంగా నిర్వహించారు. లోకకల్యాణార్థం కురుకుందమ్మ దేవస్థానంలో మార్చి 8 నుంచి మార్చి 12వ తేది వరకు కురుకులాంబ జయంతి ఉత్సవాలలో భాగంగా వేద పండితుడు వెంకట చలపతిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన సుమారు 30 మంది రుత్వికులు ఆలయ ఆవరణలో గణపతిపూజ, మన్య సూక్త హవనం,పుణ్యాహవచనం, చండీహోమాన్ని నిర్వహించారు. ఈ హోమ పూజల్లో దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం బలిదానం, కుంబాభిషేకం, పూర్ణాహుతితో ఈ వేడుకలను ముగించారు. భక్తులకు మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కొణిదేలలో ప్రముఖుల పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కొణిదేలలోని మత్కోణిదేల భ్రమరాంబిక, మల్లికార్జున స్వామి అమ్మవార్ల రథోత్సవం సందర్భంగా ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి పూజల నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగి ఉత్సవాన్ని ప్రారంభించారు. గ్రామ రైతు కమిటీ ఆధ్వర్యంలో ఎద్దుల బండ లాగుపోటీలను నిర్వహించారు. ఆత్మకూరు డీఎస్పీ రాంజినాయక్ పర్యవేక్షణలో నందికొట్కూరు పట్టణ సి.ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ముచ్చుమర్రి, నందికొట్కూరు, జూపాడుబంగ్లా, బ్రాహ్మణకొట్కూరు, మిడ్తూరు ఎస్ఐలు విధులు నిర్వహించారు. టీడీపీ నాయకులు వీరం ప్రసాద్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'దేశభక్తిని పెంచడమే ధ్యేయం'

పాణ్యం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బాలబాలికల్లో దేశభక్తిని, క్రమశిక్షణను పంపొందించడమే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ధ్యేయమని ఎంఈవో కోటయ్య అన్నారు. బుధవారం ప్యాట్రోన్ లీడర్స్ శిక్షణా కార్యక్రమాన్ని పాణ్యంలో ఘనంగా ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ లో నంద్యాల జిల్లాకు చెందిన 28 పీఎం శ్రీపేజ్ 1 పాఠశాలలకు చెందిన 224 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల మంచి శిక్షణ పొంది ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రేమ్‌నాథ్ అన్నారు. కార్యక్రమంలో ఏఎంవో లలిత, జిల్లా కార్యదర్శి లింగారెడ్డి, ఎంఈవో-2 సుబ్రహ్మణ్యం, విజయానికేతన్ పాఠశాల డైరెక్టర్ విజయభాస్కర్, ఏఎస్‌వోసీ లియో ఆంటోని, స్కౌట్స్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

'సురక్షితమైన నీటిని అందించడమే లక్ష్యం'

కొత్తపల్లి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఉన్న విద్యార్థులకు సురక్షితమైన మంచినీరు అందించడమే కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ లక్ష్యమని సంస్థ జోనల్ మేనేజర్ దామోదర్ నాయుడు, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కిషోర్ ఏరియా మేనేజర్ సుబ్బారెడ్డి, జోనల్ హెచ్‌ఆర్ మహేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సమకారంతో ఆర్వో వాటర్ ప్లాంటు ప్రారంభించారు. కొత్తపల్లి గ్రోమోర్ మేనేజర్ నాగశేషులు, సర్పంచ్, పాఠశాల చైర్మన్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

దివ్యాంగుల అవస్థలు

నంద్యాల హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జీజీహెచ్‌లో జరుగుతున్న సదరం క్యాంప్‌లో సర్టిఫికెట్ల పరిశీలన కోసం వస్తున్న దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం జారీచేస్తున్న నోటీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. మొదట ఈ నెల 11న హాజరు కావాలని, తిరిగి 12వ తేది వెళ్లాలని నోటీస్ జారీ చేశారు. అంతకుముందే 12వ తేదీ వెళ్లేవారికి నోటీసులు జారీచేశారు. దీంతో బుధవారం నంద్యాల జీజీహెచ్‌కు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం 11, 12తేదీల్లో నోటీసులు ఇచ్చినవారు వచ్చారు. జీజీహెచ్‌లో బుధవారం పరిశీలించాల్సినవారి సంఖ్య ఎక్కువ కావడంతో వచ్చిన దివ్యాంగులు టోకెన్ దొరక్కపోవడంతో కొందరు వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. బనగానపల్లె నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఈ పరిస్థితి ఏర్పడింది. ప్రణాళికలో భాగంగా 12వ తేది హాజరుకమ్మని ఇచ్చిన నోటీసు వారికే ప్రాధాన్యమిస్తూ మూగ, చెవిటి విభాగంలో 60మందికి మాత్రమే టోకెన్లు



టోకెన్ కోసం అవస్థలు పడుతున్న దివ్యాంగులు

జారీచేశారు. మిగిలినవారికి టోకెన్లు అడగ్గా ప్రస్తుతానికి టోకెన్లు జారీ చేయడం అయిపోయిందని సమాధానం ఇవ్వడంతో దివ్యాంగులు వెనుదిరిగిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. మండల పరిషత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నోటీసు జారీ విషయంలో సరైన పద్ధతి పాటించి ఉంటే ఇలాంటి తిప్పలు ఉండేవికావని దివ్యాంగులు వాపోయారు.

అటవీశాఖ తీరుపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా ఆగ్రహం



ఆత్మకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ తీరుపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా అటవీశాఖ వ్యవహరిస్తున్న దుశ్చర్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కడప జిల్లాలోని బద్వేలు తాలుకాలో గల జ్యోతిక్షేత్రంలో కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన సత్రాన్ని కూల్చివేయడం బాధాకరమని అన్నారు. వాస్తవానికి రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లా పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతాల్లో వెలసిన ప్రసిద్ధ ఆలయాల వద్ద కాశిరెడ్డినాయన ఆశ్రమం వారు భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనాధిగా వస్తున్న అన్నదాన కేంద్రాలపై అటవీ అధికారులు దుందుడుకుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అడవుల రక్షణ అందరి బాధ్యతని, అదేక్రమంలో భక్తుల మనోభావాలను అటవీ శాఖ పరిగణన లోకి తీసుకోవాలన్నారు. అలా కాకుండా మారాజ్యం అన్నట్లుగా ఇష్టారాజ్యంగా అడుగడుగున ఆటంకాలు సృష్టిస్తున్నట్లు సభ దృష్టికి తీసుకెళ్లారు. బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం క్షేత్రంలో కూడా అనేకమార్లు అటవీ అధికారులు దూకుడుగా వ్యవహరించారని ఈ అవిషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు చెప్పారు. రెండు రోజుల క్రితం మహానంది నుంచి గాజులపల్లి వరకు నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులను కూడా అడ్డుకుని అత్యుత్సాహాన్ని ప్రదర్శించారని తెలిపారు. గతంలో చెంచు గిరిజనులపై కూడా దౌర్జన్యంగా దాడులు చేశారని గుర్తుచేశారు. చట్టాల పట్ల కనీస గౌరవం లేకుండా అటవీ అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అటవీ, దేవాదాయశాఖలు స్పందించి అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సాక్షిగా కోరారు.

15 నుంచి ఉరుసు

మిడుతూరు, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలదడియ గ్రామంలోని హజరత్ సయ్యద్ సుల్తాన్‌షా ఖాద్రి స్వామి ఉరుసును ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి హజరత్ సయ్యద్ సుభహాన్ షా ఖాద్రి బుధవారం తెలిపారు. 15వ తేది గంధం, 16త తేదిన సాయంత్రం ఉరుసు, 17వతేది కిస్తీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

17న దుకాణాల వేలం

నంద్యాల కల్చరల్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని మూలసాగరంలో వెలిసి రామస్వామి దేవస్థానానికి చెందిన 2 షాపులను, బస్టాండు దగ్గరలోని ఆంజనేయ కోదండరామస్వామి దేవస్థానానికి చెందిన 1 షాపునకు ఈనెల 17వ తేదిన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో వేణునాథరెడ్డి తెలిపారు. మూడేళ్ల నిర్వహించుకోడానికి వేలం నిర్వహిస్తున్నామని, ఆయా దేవాలయాల ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఆలయాలకు చెందిన కార్యాలయాల్లో సంప్రదించాలని ఈవో తెలిపారు.

రైతులకు అవగాహన

మహానంది, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఎం.తిమ్మాపురం గ్రామంలో స్పైసిస్ బోర్డు ఆధ్వర్యంలో పసుపు పంటపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు మాట్లాడుతూ ఉద్యానవనశాఖ తరుపున ఎత్తు మడుల పద్ధతికి యంత్రాలను, పసుపు హార్వెస్టర్స్‌ను క్రొత్త రకాలకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. ఉద్యాన అధికారి శ్రీధర్, శాస్త్రవేత్త రాగూర్ నాయక్, మండల కన్వీనర్ మధు, ఎస్‌పీవో చైర్మన్ లక్ష్మయ్య, పసుపు రైతులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: రైతులకు సాగుపై సులభతరంగా వ్యవసాయ సేవలు అందిస్తున్నట్లు డీఏవో మురళీకృష్ణ తెలిపారు. బుధవారం ఏవో ప్రసాదరావు ఆధ్వర్యంలో రాయమాల్పురం, మునగాల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వరి పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఏడీఆర్ రాజశేఖర్, ఎఇవో మనోహర్, రైతు సేవా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ ఆసుపత్రిపై విచారణకు ఆదేశం

నంద్యాల హాస్పిటల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని సెవెన్ హిల్స్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిపై డీఎంహెచ్‌వో విచారణకు ఆదేశించారు. గత ఏడాది డిసెంబరు 22న కడుపునొప్పితో బేబిశాంతి అనే మహిళ ఆసుపత్రికి వెళ్లారు. అయితే సరైన చికిత్స అందించకపోగా ఆస్పత్రి సిబ్బంది రూ.7 వేలు వసూలు చేశారని మహిళ సోదరుడు కె.సతీష్‌కుమార్ నంద్యాల డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా స్కానింగ్ రిపోర్టు కానీ, ఫిల్మ్‌కానీ ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు నంద్యాల డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ విచారణ కమిటీని వేశారు. ఈ కమిటీలో డీఐవో డా.సుదర్శన్‌బాబు, డా.భరత్‌కుమార్ ఉన్నారు. గురువారం సెవెన్ హిల్స్ ఆసుపత్రికి వెళ్లి సమగ్ర విచారణ చేసి నివేదికను అందించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు.

ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యంపై కూడా..

నంద్యాల జీజీహెచ్‌లో గత ఏడాది డిసెంబరు 22న బేబిశాంతి అనే మహిళ కడుపునొప్పితో ఆస్పత్రికి వచ్చింది. అయితే అడ్మిట్ చేసుకోకుండా తిరస్కరించారు. దీంతో సోదరుడు కె.సతీష్‌కుమార్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి విచారణకోసం కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీలో డా.మదన్‌మోహన్‌రావు, డా.పద్మజ, డా.జిలానీ ఉన్నారు.

'పారదర్శకమైన ఓటరు జాబితాకు సహకరించాలి'

ఆత్మకూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం నియోజకవర్గం పరిధిలోని పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి ఆయా రాజకీయ పార్టీలు సహకరించాలని ఎస్‌ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ఓ.రాంభూపాల్‌రెడ్డి కోరారు. నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన సుధారాణి ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన ఓ.రాంభూపాల్‌రెడ్డి తొలిసారిగా ఆయా మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో పాటు ఎన్నికల విభాగం సిబ్బందిచే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రమణమ్మ, సీనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, ఆయా పార్టీల నాయకులు ఉన్నారు.

సున్నిపెంటలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

సున్నిపెంట, మార్చి 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సున్నిపెంటలో డిజిటల్ స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ డిజిటల్ స్మార్టు మీటరును సెల్‌ఫోన్ ద్వారా రీచార్జి చేసుకోవచ్చునని ఏఈ ప్రసాదరావు తెలిపారు. ఉగాది ఉత్సవాల తరువాత శ్రీశైలంలో ఈ ప్రక్రియ ప్రారంబిస్తామని ఏఈ తెలిపారు. సున్నిపెంటకు మొదటి విడతగా 190 డిజిటల్ స్మార్టు మీటర్లు వచ్చాయని, బుధవానం 148 మీటర్లు బిగించినట్టు ఏఈ తెలిపారు.

'వైసీపీని ప్రజలు నమ్మరు'

మహానంది, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉనికి కాపాడుకొనేందు కోసమే వైసీపీ యువత పోరు చేపట్టిందని, వైసీపీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలుగు యువత నంద్యాల లోక్‌సభ నియోజకరవ్గ కార్యదర్శి, తెలుగుగంగ ప్రాజెక్ట్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యువత జీవితాలను నాశనం చేయడానికి మాజీ సీఎం జగన్ కుట్రలు పన్నుతున్నారని అన్నారు. పరీక్షల సమయంలో ధర్నాలు అంటూ విద్యార్థులపై కపట ప్రేమ ప్రదర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు.

'జగన్ ఇంటి ముందు ధర్నా చేయాలి'

గడివేముల: వేల కోట్ల రూపాయలు బకాయిలు పెట్టిన మాజీ సీఎం ఇంటి ముందు యువత పోరు ధర్నా చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్లలో వైసీపీకి గుర్తు రాని ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు ఆదేశించారు. దిగువ అహోబిలంలో బుధవారం రాత్రి కల్యాణోత్సవం జరుగుతున్న సందర్భంగా భద్రతా చర్యలను ఆయన పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎగువ, దిగువ అహోబిల క్షేత్రాల్లోని క్యూలైన్లు, కల్యాణోత్సవం జరిగే ప్రదేశం, వీఐపీ, జనరల్ గ్యాలరీలు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఏఎస్పీ వెంట ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్, రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి

శిరివెళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న వ్యాధి నిరోధక టీకాలతో రోగాల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి సుదర్శన్ బాబు తెలిపారు. శిరివెళ్లలోని ప్రభుత్వ వైద్యశాల, సచివాలయం-2లో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యుడు ముఖేష్, సీహెచ్‌వో రామ్మోహన్‌రెడ్డి, పీహెచ్ఎన్ సరస్వతి పాల్గొన్నారు.

ట్యాంకర్లతో మొక్కలకు నీరు



మొక్కలకు ట్యాంకర్ ద్వారా నీరు పడుతున్న టోల్ సిబ్బంది

చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టోల్‌ప్లాజ్ పరిధిలో హైవే రహదారిలో ఇరు వైపులా నాటిన మొక్కలను వేసవిలో సంరక్షించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశా రు. దువ్వూరు నుంచి చాగలమర్రి టోల్ ప్లాజా వరకు 17 కిలో మీటర్ల వరకు ఇరువైపులా హైవే రహదారిలో ఉన్న మొక్క లకు ట్యాంకర్ల ద్వారా నీరు అంది స్తున్నారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు మొక్కలకు ట్యాంక్ల ద్వారా నీరు అందిస్తామని మేనేజర్ తెలిపారు.

డిగ్రీ కళాశాల రికార్డుల ఆడిట్

శిరివెళ్ల, మార్చి 12(ఆంధ్రజ్యోతి) : కమిష నర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అకడమిక్ ఆడిట్ నిర్వహించారు. 2023-24,25 విద్యా సంవత్సరాల్లో నిర్వహించిన కళాశాల అకడమిక్ రికార్డులను కోవెలకుంట్ల, ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల, జువాలజీ అధ్యాపకులు బాస్కర్‌రెడ్డి, కృష్ణ పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ ఇంద్రావతి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, కో-ఆర్డినేటర్లు జనార్ధనుడు, ఖాసీం సాహెబ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

కొలిమిగుండ్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని వాల్మీకినగర్ సమీపంలో లీకేజీ అవుతున్న పైపులైన్‌కు బుధవారం మరమ్మతులు నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ జినుగు శివ రాముడు వెల్లడించారు. వేసవి నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలతో పైప్‌లైన్స్‌కు మరమ్మతు చేస్తున్నామన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శివ సూచించారు.

ఆలయానికి విరాళం

రుద్రవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలోని దొర్వి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన కాణాల హరిక్రిష్ణగౌడ్ రూ.50116 బుధవారం దేవాలయ నిర్వాహకుడు బండల శ్రీను, వాసాపురం వెంకటేశ్వరస్వామి కోశాధికారి నరసింహులుకు అందించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



బేతంచెర్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ జెండాను మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ముర్తుజావలి, ఖాజా హుశేన్, సీతారామచంద్రుడు, పుసులూరు మురళీ కృష్ణ, గూని నాగరాజు, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డోన్ టౌన్: పట్టణంలోని వైసీపీ పార్టీ కార్యాలయం వద్ద వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. అనంతరం వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి డోన్ నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, జిల్లా వలంటరీ విభాగం అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, వైసీపీ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్, నాయకులు మల్లికార్జున రెడ్డి, రామచంద్రుడు పాల్గొన్నారు.

పింఛన్ల రీ వెరిఫికేషన్

బనగానపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): నకిలీ పింఛన్లు ఏరివేత కార్యక్రమంలో భాగంగా బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సదరన్ క్యాంపు రెండో విడత బుధవారం నిర్వహించారు. మండలంలో దివ్యాంగులు 560 మంది ఉన్నట్లు ఎంపీడీవో రమణ తెలిపారు. వీరికి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలలో సదరన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేటాయించిన తేదీల్లో క్యాంపునకు హాజరు కావాలన్నారు. మానసిక దివ్యాంగులకు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో సదరన్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఉపాధికి ఊతం

- జాతీయ పశు సంపద పథకం పాడి రైతుకు వరం
- యూనిట్ స్థాయిని బట్టి రూ.30 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణం - 50 శాతం సబ్సిడీ

కొలిమిగుండ్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమపై ఆసక్తి కలిగిన ఔత్సాహిక రైతులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న జాతీయ పశు సంపద పథకం(నేషనల్ లైవ్ స్టాక్ మిషన్) ఊతంగా మారింది. పూర్తిగా ఆన్‌లైన్ దరఖాస్తులతో ముందుకు సాగే ఈ పథకంపై క్షేత్ర స్థాయిలో పాడి రైతులకు, ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం గమనార్హం.

ఈపథకంలో గొర్రెలు, మేకలు, కోళ్ల, పందుల యూనిట్లతో పాటు, పచ్చిమేత యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. చదువు వయసుతో సంబంధం లేకుండా ఆసక్తి ఉన్న వారు ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. పథకం పొందే వారు తప్పనిసరిగా సొంత భూమి కలిగి ఉండాలి. ఆధార్-ఓటరు గుర్తింపు-పాన్ కార్డు-డ్రైవింగ్ లైసెన్సు వంటి గుర్తింపు కార్డులు.

పథకం లబ్ధి కోసం ఉండాల్సిన అర్హతలు

స్థానికత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు, మూడేళ్ల ఆదాయపు పన్ను రిటర్న్ పత్రాలు, ఆరునెలల బ్యాంకు స్టేట్‌మెంట్, భూమి ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం, ఏర్పాటు చేయబోయో యూనిట్ మొత్తానికి సంబంధించిన నివేదిక వంటి పత్రాలను అందుబాటులో ఉంచుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

గ్రామాల్లో, పట్టణాల్లో రైతులు ఏర్పాటు చేసే యూనిట్ స్థాయి, రైతు అర్హతను బట్టి రూ.30లక్షల నుంచి రూ.కోటి రూపాయల వరకు ఈ పథకం ద్వారా పొందే అవకాశం ఉండటం ఓ వరంగా మారనుంది. రూ.1కోటి రూపాయాల పథకం కోసం రూ.50లక్షల బ్యాంకు గ్యారంటీతో రుణం పొందే అవకాశం కల్పించారు. ఇందులో ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అందిస్తుండగా, మిగిలిన 50శాతం యూనిట్ ఏర్పాటు చేసిన రైతు చెల్లించాల్సి ఉంటుంది.

పథకం అమలు విధానం

పశు పోషణతో పాటు వివిధ రకాల యూనిట్లు నెలకొల్పి ఈపథకం ద్వారా లబ్ధి పొందే అవకాశాన్ని కల్పించారు. పశువుల పెంపకం యూనిట్లు, గొర్రెల పెంపకం యూనిట్లు, పశు గ్రాసం కొరత నివారించడానికి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విత్తనాల సరఫరా, మాంసం, గుడ్లు, ఉన్ని ఉత్పత్తి లో పరిశోధనలకు ప్రోత్సాహం తదితర యూనిట్లు నెలకొల్ప డం ద్వారా ఉపాధి కల్పించే విధంగా ఈపథకానికి శ్రీకారం చుట్టారు. ఈపథకం దరఖాస్తుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్ ఎల్ ఎం.యూడీవైఎఎంఐఎంఐటి ఆర్ఏ.ఇన్ వెబ్ సైట్లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్ర స్థాయి కమిటీ దీన్ని క్షుణ్ణంగా పరిశీ లించి, వివిధ శాఖల అధికారులు క్షేత్ర పరిశీలన అనంతరం కేంద్ర కమిటీకి సిఫార్సు చేస్తారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ అధికా రులు దీన్ని పరిశీలించి నిధులు విడుదల చేస్తారు. ఈపథకం కోసం దరఖాస్తుదారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. ఈ పథకానికి ఎంపి కైన వారు ప్రతి నెలా పశుసంవర్ధకశాఖ అధికారులకు ఫొటోలు పంపాల్సి ఉంటుంది. పథకాన్ని దుర్వినియోగం చేయకుండా లబ్ధిదారుడి నుంచి గ్యారంటీ పత్రాన్ని అధికారులు తీసుకుంటారు.



పాడి గేదెల యూనిట్

నిధులు త్వరగా విడుదల చేయాలి



తమ స్వశక్తితో ఉపాధి పొందాలనుకున్న వారికి చక్కటి ప్రోత్సాహం ఈ పథకం ద్వారా అందుతుంది. ప్రభుత్వం పథకాన్ని మరింత సులభతరం చేసి, నిధుల విడుదలలో జాప్యం లేకుండా త్వరితగతిన విడుదల చేయాలి.

- అంబటి విశ్వనాథరెడ్డి, లబ్ధిదారుడు

అవగాహన కల్పించాలి



జాతీయ పశు సంపద పథకం ఎంతో ప్రాధాన్యతమైనది. అయితే ఈపథకంపై రైతులు, ఇతర వర్గాల్లో సరైన అవగాహన లేదు. నేషనల్ లైవ్ స్టాక్ మి షన్ పథకం విస్తృత అవగాహన కల్పించా ల్సిన అవసరం ఉంది.

- నంద్యాల ప్రసాద్ యాదవ్, పాడి రైతు, మదనంతపురం

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ఆసక్తి కలిగిన తమ ఇంటి నుండే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనలను పూర్తి స్థాయిలో పరిశీలించి పథకాన్ని మంజూరు చేస్తారు. పాడి పరిశ్రమ వృద్ధికి పథకం ఎంతగానో దోహద పడుతుంది.

- గోవిందునాయక్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

భూమా నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12(ఆంధ్రజ్యోతి) : దివంగత ఎంపీ భూమా నాగిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. భూమా నాగిరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా ఆళ్లగడ్డ పట్టణంలోని భూమా ఘాట్‌లో తండ్రి భూమా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి జగత్ విఖ్యాత్‌రెడ్డి బుధవారం నివాళి అర్పించారు. భూమా కుటుంబం కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు.

● నివాళి అర్పించిన మంచు మనోజ్, మౌనిక దంపతులు

దివంగత నేత భూమా నాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిన్న కుమార్తె భూమా మౌనిక, మంచు మనోజ్ దంపతులు బుధవారం నివాళి అర్పించారు. హైదరాబాద్ నుంచి వారు నేరుగా ఆళ్లగడ్డలోని భూమా ఘాట్‌కు చేరుకుని భూమా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు తిరిగి హైదరాబాద్‌కు పయనమయ్యారు.

దొర్నిపాడు మండలంలో..

దొర్నిపాడు: నంద్యాల మాజీ ఎంపీ భూమా నాగిరెడ్డి సేవలు చిరస్మరణీయమని టీడీపీ మండల నాయకుడు సిద్ధి సత్యం అన్నారు. బుధవారం భూమా నాగిరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, జిల్లా సుబ్బన్న, తోట సంజీవరాయుడు, పగడాల రమేష్‌బాబు తదితరులున్నారు.



భూమా ఘాట్‌లో నివాళి అర్పిస్తున్న యువ నాయకుడు జగత్ విఖ్యాత్‌రెడ్డి

యర్రగుంట్లలో ..

శిరివెళ్ల : ఆళ్లగడ్డ, నంద్యాల నియోజకవర్గాల అభివృద్ధికి భూమా నాగిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని యర్రగుంట్ల-2 ఎంపీటీసీ కమతం జయరామిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శీలం లక్ష్మీప్రసాద్ అన్నారు. భూమా నాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా యర్రగుంట్లలోని టీడీపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి బుధవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కమతం సుబ్బారెడ్డి, శీలం రామ్మోహన్, రాము, హుసేన్ బాషా, సిరాజ్, అలీ పాల్గొన్నారు.

గిరిజనులపై దౌర్జన్యాలు చేస్తే సహించేదిలేదు

● ఏపీ ఎరుకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ప్యాపిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గిరిజనులపై దౌర్జన్యాలు చేస్తే సహించేదిలేదని ఏపీ ఎరుకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు హెచ్చరించారు. పట్టణంలోని గిరిజన మహిళ మనోరమకు చెందిన ఏడు సెంట్ల విలువైన స్థలాన్ని ఓ రాజకీయ నాయకుడు ఆక్రమించడాన్ని నిరశిస్తూ గిరిజన, ఎరుకుల సంఘాల నాయకులు బుధవారం స్థానిక పోలీసు స్టేషన్, తహసీల్దారు కార్యాలయాల ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ మనోరమ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా ఆమెను ఫోన్ ద్వారా సదరు నాయకుడు రాజకీయ నాయకులతో బెదరింపులకు గురిచేయడం బాధాకరమన్నారు. ఆతడి వైఖరిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. అనంతరం సీఐ వెంకటరామిరెడ్డికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు సూర్యనారాయణ, సూర్యుడు, పెద్దరాముడు, బాలక్రిష్ణ, మనోరమ, హేమలత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సంజామల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పది పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలను సాధించాలని హెచ్ఎం శంకర్, ఎంఈవో ఈశ్వరయ్య కోరారు. బుధవారం పదో తరగతి విద్యార్థులకు సరస్వతీ పూజ ఏర్పాటు చేసి విద్యార్థులకు హాల్‌టికెట్లను అంద జేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అరుణ కుమారి, పీఈటీ బాష పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, అబ్దులాపురం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు సరస్వతి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం హుసేనయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలుకూరులో వేలం

బనగానపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో బుధవారం ఈవోఆర్‌డీ సతీశ్‌రెడ్డి, గ్రామ పంచాయతీ ఈవో బాలాంజనేయులు ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. దినవారపు మార్కెట్ ద్వారా రూ.77,500లు, బండ్ల మెట్ట ద్వారా రూ. 17.52 లక్షల ఆదాయం లభించినట్లు ఈవోఆర్‌డీ తెలిపారు. ఈ ఏ డాది రూ. 2,23,500 అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

లక్ష్యాలను అధిగమించాలి

చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఫారంపండ్ లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో టీఏ, ఎఫ్ఏల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో నిర్మల, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దస్తగిరిస్వామి గంధం

చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామంలో బుధవారం దస్తగిరిస్వామి గంధం ఘనంగా నిర్వహించారు. గంధాన్ని పకీర్ల మేళతాళాల మధ్య ఊరేగింపుతో దర్గా వద్దకు తీసుకెళ్లి ఫాతెహాలు చేశారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. ఏఎస్ఐ నబీసాహెబ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

నిధులు మంజూరు

చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామంలోగల ఎస్సీ హాస్టల్ మరమ్మతు పనులు వేగవంతం చేస్తున్నట్లు పీఆర్ ఏఈ కొండారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హాస్టల్‌లో 3 నుంచి 10 వరకు చదువుతున్న విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు రూ.29 లక్షల నిధులతో పనులు చేస్తున్నామని అన్నారు. మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ తదితర పనులు వేగవంతం చేసి విద్యార్థులకు సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఖాసీం, మురళీ ఉన్నారు.

నేడు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా గురువారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎద్దుల యజమానులు ఉదయం దర్గా వద్ద తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేస్తామన్నారు.

రిజిస్ట్రేషన్ చేసుకోండి

డోన్ టౌన్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్కిల్ టైలరింగ్ సెంటరు ద్వారా శిక్షణ పొందేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. 70 శాతం అటెండెన్స్ పొందిన మహిళలందరికీ కుట్టుమిషన్లు పంపిణీ చేస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం

బేతంచెర్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రజాసమస్యల పరిష్కారానికి కలిసి పోరాడుదామని సీపీఎం పట్టణ కార్యదర్శి వైబీ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఎం.మధు శేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని తాసిల్‌పేట, బోయపేట, గొల్లపేట కాలనీల్లో సీపీఎం నాయకులు బి.రామాంజనేయులు, జి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, చిన్న వెంకటేశ్వర్లు, టింగు, యువరాజు, రాజు, బక్కన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి యూనిట్ కాస్ట్ పెంపు

రుద్రవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణం యూనిట్ కాస్ట్ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. గతంలో రూ.1.80 లక్షలు ఉండేదన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం యూనిట్ కాస్ట్ కన్నా అదనంగా నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆసక్తి కలిగిన లబ్ధిదారులు గృహాలు నిర్మించేందుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పీడియాట్రిక్ విభాగంలో కళ్యాణ్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్



వై.కళ్యాణ్‌కుమార్

బనగానపల్లె, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ వై. ప్రసాద రావు, వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు వై. కళ్యాణ్‌కుమార్ పోస్టుగ్రాడ్యుయేట్‌లో పీడి యాట్రిక్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. పది వరకు బనగానపల్లె నెహ్రూ పాఠశాలలో, ఇంటర్ విజయవాడలో ఎంబీబీఎస్ కర్నూలు మెడికల్ కళాశాలలో చదివిన కళ్యాణ్‌కుమార్ పీజీ పీడియాట్రిక్‌ను కాకినాడలోని రంగరాయ కళాశాలలో చదివి గోల్డ్‌మెడల్ సాధించారు.

ఏడు మోటార్ల కేబుల్స్ చోరీ

రుద్రవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం గ్రామ పరిధిలోని ఏడు వ్యవసాయ మోటార్ల కేబుల్స్ చోరీకి గురైనట్లు బుధవారం రైతులు తెలిపారు. రుద్రవరం గ్రామానికి చెందిన నారాయణ, బాలయ్య, ఎర్రన్న, సురేశ్, కన్నయ్య, రాజు అనే వ్యక్తులు తమ పొలాల్లోని బోరుబావుల కేబుల్స్ మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని తెలిపారు. కేబుల్స్ విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని రైతులు తెలిపారు.

ఐదెకరాల్లో అరటి తోట దగ్ధం

ప్యాపిలి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామంలో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఐదెకరాల్లో అరటి తోట అగ్నికి ఆహుతైంది. మండలంలోని గోపాలనగరం గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ రామక్రిష్ణాపురంలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి సాగు చేశారు. అయితే బుధవారం ప్రమాదవశాత్తు తోటకు నిప్పు అంటుకుంది. గ్రామస్థులు డోన్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైరింజన్ వచ్చేసరికి తోట మొత్తం అగ్నికి కాలిబూడిదైంది. అనంతరం రైతు జలదుర్గం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

యాపదిన్నె సర్పంచ్‌పై కేసు నమోదు

డోన్ రూరల్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం యాపదిన్నె గ్రామ సర్పంచ్‌పై కేసు నమోదైనట్లు పట్టణ సీఐ ఇంతి యాజ్ బాషా తెలిపారు. వివరాలివీ.. గత నెల 20న విజయవాడలో టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదికలో యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి తమ ప్రమేయం లేకుండా వాటర్ షెడ్ పనులు గ్రామంలో చేపట్టారని ఫిర్యాదు చేశారు. అలాగే డోన్ మండల పరిషత్ కార్యాలయంలో వాటర్‌షెడ్ పీవో విజేతమ్మను కలిసి తన వాదనను వినిపించారు. ఈ సందర్భంగా వాగ్వాదం జరిగింది. సర్పంచ్ తమ విధులకు ఆటంకం కలిగిస్తూ దుర్భాషలాడారని పీవో విజేతమ్మ చేసిన ఫిర్యాదుపై సర్పంచ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వెండి నక్షత్ర పళ్లెం వితరణ



చాగలమర్రి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మూర్తి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి రూ.90వేలు విలువ చేసే నక్షత్ర హారతి పళ్లెంను దాతలు మూర్తి కొండయ్య, సుభద్రమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు బుధవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.

పంట సాగు నమోదు తుది జాబితా విడుదల

రుద్రవరం, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటల తుది జాబితా విడుదల చేసినట్లు వ్యవసాయాధికారి సుమతి అన్నారు. బుధవారం మండలంలోని యల్లావత్తుల, కోటకొండ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 19లోపు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా తప్పొప్పులను సవరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీఏఏలు రేష్మ, రేవతి, శివక్రిష్ణ పాల్గొన్నారు.

మీర్జాపురం పైప్‌లైన్ లీకేజీ

- అందని తాగునీరు - పట్టించుకోని పాలకులు

కొలిమిగుండ్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్ల గ్రామ సమీపంలోని పొగాకు చేలో బోర్ల నుంచి మీర్జాపురం గ్రామానికి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ మంగళవారం సాయంత్రం లీకేజీ అయింది. దాంతో నీరంతా వృథాగా పోతోంది. బోరు బావుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో పాటు, అవుకు రిజర్వాయర్ నీరు సరఫరా అవుతున్నా గ్రామంలో పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో తాగునీరు అందడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లబ్ధిదారులకు అదనపు సాయం

కోవెలకుంట్ల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా ఆర్థిక సాయం అందిస్తుందని ఎంపీడీవో వర ప్రసాదరావు, హౌసింగ్ ఏఈ రమణారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వివిధ నిర్మాణ దశల్లో ఉన్న బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీకు రూ.75 వేలు చెంచులకు రూ. లక్ష ప్రభుత్వం అదనంగా అందిస్తుందన్నారు. అవకాశాన్ని గృహ నిర్మాణ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుధ్య బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదే

ఉయ్యాలవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత గ్రీన్ అంబాసిడర్లదేనని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక చెత్త సంపద కేంద్రంలో ఆయా గ్రామాల గ్రీన్ అంబాసిడర్లకు శిక్షణ ఇచ్చారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఓబులేసు, రీసర్స్ పర్సన్ దస్తగిరిబాబు, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, శారిటేషన్ మండల కో-ఆర్డినేటర్ రమణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు ఆళ్లగడ్డ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0లో భాగంగా ఆళ్లగడ్డ మండల పరిధిలోని హరినగరం గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. నాటుసారా తాగితే కలిగే అనర్థాలను సీఐ గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు సరస్వతి, శ్రీనివాసులు, నాబార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

కూలీలతో పనులు చేయించాలి

ఉయ్యాలవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రోజూవారి వేతనం రూ. 300 తగ్గకుండా పనులు చేయించాలని ఏపీవో రవిప్రకాష్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల ఎఫ్ఏలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీల హాజరు విషయంలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ నెల చివరి నాటికి 46 ఫారంపండ్స్ పూర్తి చేయాలన్నారు. మండలంలో 605 ఇంకుడు గుంతలు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈసీ షరీఫ్‌బాష, టీఏలు ఉన్నారు.

మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక టీమ్‌లు

ఉయ్యాలవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): పొదుపు మొండి బకాయిల వసూలుకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్లు వెలుగు ఏపీఎం దాసన్న బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీనిధి ద్వారా మండలంలోని ఆయా గ్రూపులకు రూ. మూడు కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ఈ రుణాల్లో రూ. 40 లక్షలు మొండి బకాయిగా నిలిచిపోయిందన్నారు. దీని వసూలుకు మండలంలో రెండు టీములను ఏర్పాటు చేశామన్నారు. వీరు వారం రోజుల పాటు మండలంలోని హరివరం, అల్లూరు, రూపనగుడి, బోడెమ్మనూరు, ఆర్.పాంపల్లె గ్రామాల్లో పర్యటించి వసూలు చేస్తారన్నారు.